ఆనందమని పింఛన్

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా బుధవారం సామాజిక పింఛన్ల పంపిణీ జోరుగా సాగింది. తెల్లవారుజాము నుంచే గ్రామ వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలోని తొలిరోజు 90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం నియోజవర్గంలో 24 వేలకు పైగా వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్లు అందజేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వలంటీర్ల, సచివాలయ సిబ్బంది ఉదయాన్నే తలుపు తట్టి పింఛన్లు అందజేయడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లి పింఛను అందజేత

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగి గ్రామానికి చెందిన చెవల బాబులు గత కొంత కాలంగా అనారోగ్యంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో ఆయన పింఛను సొమ్ము తీసుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామ వలంటీర్ గౌరీప్రియ వ్యయ, ప్రయాసలకు ఓర్చి ఒమ్మంగి నుంచి కాకినాడ 50 కిలోమీటర్లు ఆర్టీసీ బస్‌లో ప్రయాణించి బాబులుకు పింఛను అందజేసింది. వలంటీర్ గౌరీప్రియను గ్రామ సర్పంచ్, నాయకులు అభినందించారు.



ఏలేశ్వరంలో వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న వలంటీర్, కన్వీనర్లు



కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాబులుకు పింఛను అందజేస్తున్న వలంటీర్ గౌరీప్రియ

ప్రత్తిపాడు మండలంలో 70 శాతం

ప్రత్తిపాడు: మండల వ్యాప్తంగా తొలిరోజు బుధవారం 70 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యింది. మండలంలోని 23 గ్రామ సచివాలయాల పరిధిలో 11,846 మంది పింఛనుదారులుండగా సుమారు 8,300 మందికి వలంటీర్లు పింఛన్లు బట్వాడా చేశారని ఎంపీడీఓ ఎస్.వెంకటాచలం తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వలంటీర్లతో కలిసి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.



ప్రత్తిపాడులో దివ్యాంగురాలికి పింఛను అందిస్తున్న వలంటీర్, వైఎస్సార్ సీపీ నాయకులు

కన్నులపండువగా శ్రీవారికి చక్రస్నానం



శ్రీవారి పుష్కరిణిలో పవిత్ర సప్తనదీ జలాలు వేస్తున్న మంత్రులు కొట్టు సత్యనారాయణ, దాడిశెట్టి రాజా



శ్రీవారి చక్రస్నానం అనంతరం పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- పుష్కరిణిని ప్రారంభించిన మంత్రులు
- ఆలయం వద్ద భారీ అన్నసమారాధన

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద నూతనంగా నిర్మించిన పుష్కరిణి (లక్ష్మీదేవి కోనేరు)లో బుధవారం శ్రీవారి చక్రస్నానం కన్నులపండువగా నిర్వహించారు. మంత్రులు కొట్టు సత్యనారాయణ, దాడిశెట్టి రాజా, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు శ్రీవారి పుష్కరిణిని ప్రారంభించి, వివిధ దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు శాస్త్రోక్తంగా పుష్కరిణిలో తొలి చక్రస్నానం నిర్వహించారు. అనంతరం భక్తులను అనుమతించడంతో పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకున్నారు. గోవింద మాలధారణ భక్తులు, సాధారణ భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. పండితులు స్వామివార్లకు హోమం, మహా పూర్ణాహుతి, మహా సంప్రోక్షణ, విశ్వరూప దర్శనం, శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. పుష్కరిణి ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలకు దేవస్థానం అర్చకులు, ధర్మకర్తలు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పుష్కరిణి ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠ అనంతరం ఘనంగా సత్కరించి స్వామివారి చిత్రపటాలు, ప్రసాదాలను అందజేశారు. పాత సంచుల వర్తక సంఘం, గ్రామస్తుల సహకారంతో పుష్కరిణి, దేవతామూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు దేవస్థానం చైర్మన్ కోలా భీమేశ్వరరావు తెలిపారు. మధ్యాహ్నం ఆలయం వద్ద మహా అన్నసమారాధన నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. తుని రూరల్, పట్టణ సీఐలు ఎ.సన్యాసిరావు, నాగదుర్గా ప్రసాద్, రూరల్, కోటనందూరు ఎస్సైలు ఎ.బాలాజీ, స్వామినాయుడు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, జెడ్పీటీసీ సభ్యురాలు పోతల సూర్యమణి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, తుని ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్, లోవ దేవస్థానం మాజీ చైర్మన్ బొంగు ఉమారావు, లోవ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు, నాయకులు సకురు నాగేంద్ర నెహ్రూ, నరిశే శివగణేష్, చోడిశెట్టి త్రిమూర్తు స్వామి, వ్యవసాయ సలహా మండలి విశాఖ జిల్లా చైర్మన్ చిక్కాల రామారావు పాల్గొన్నారు.

వేదపండితుడు కామశాస్త్రి సేవలు అమోఘం

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి వేదపండితుడు బ్రహ్మశ్రీ ముష్టి కామశాస్త్రి అందించిన సేవలు అమోఘమని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్ బాబు అన్నారు. దేవస్థానంలో సుమారు 40 సంవత్సరాల పాటు పని చేసి ఉద్యోగ విరమణ చేసిన ముష్టి కామశాస్త్రిని బుధవారం రత్నగిరిపై దేవస్థానం వేదపండితులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దేవస్థానంలో తెల్లవారుజామున సత్యదేవుని సుప్రభాత సేవ నుంచి రాత్రి జరిగే పవళింపు సేవ వరకూ అన్ని కార్యక్రమాల్లోనూ కామశాస్త్రి కీలక భూమిక పోషించారని ప్రశంసించారు. దేవస్థానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం కామశాస్త్రి, శ్రీలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, యనమండ్ర శర్మ, గంగాధరబట్ల గంగబాబు, అమరేశ్వర ఘనపాఠి, ముష్టి పురుషోత్తం, వ్రతపురోహిత సంఘం అధ్యక్షుడు నాగాభట్ల రవిశర్మ, దేవస్థానం ఏఈఓలు కృష్ణారావు, ఎల్. శ్రీనివాస్, సూపరింటెండెంట్లు అనకాపల్లి ప్రసాద్, రమణ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ చేసిన వేదపండితుడు కామశాస్త్రి దంపతులను సత్కరిస్తున్న ఆలయ అధికారులు

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



ఎస్వీ నగరం రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కత్తిపూడిలో తుడుపులమ్మతల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

రౌతులపూడి: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని, ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ సూచించారు. మండలంలోని ఎస్వీ నగరంలో గ్రామ పెద్దలు, యువత ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన రామాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఆలయ పండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం రామాలయం ఆవరణ అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

వైభవంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

శంఖవరం: మండలంలోని కత్తిపూడిలో నూతనంగా నిర్మించిన తుడుపులమ్మతల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఆలయ పండితులు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ పర్వత రాజబాబు, పెయ్యాల కృష్ణ, గౌతు నాగు, గౌతు అర్జుబాబు తదితరులు ఉన్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నవధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ

జగ్గంపేట: నవధాన్యాల సాగుతో భూసారం పెరగడంతో పాటు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని ప్రకృతి వ్యవసాయ విభాగం మాస్టర్ ట్రైనర్లు సంతోష్, బుగత అరుణ అన్నారు. మండలంలోని రామవరంలో రసాయన ఎరువులు వద్దు–నవధాన్యాల సాగు ముద్దు అనే నినాదంతో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ సంతోష్ మాట్లాడుతూ ఖరీఫ్, రబీ పంటలకు ముందు భూసారం పెంచడానికి నవధాన్యాల సాగు చేయడం ఎంతో మేలు చేస్తుందన్నారు. నవధాన్యాల సాగుతో భూమిలో సూక్ష్మ పోషకాలు పెరుగుతాయని, దీంతో రసాయన ఎరువులు, పురుగుమందులు అవసరం ఉండడదన్నారు. రైతులు నవధాన్యాల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం ఎలియాజర్, వైఎస్సార్ సీపీ నేత వత్సవాయి సత్యనారాయణరాజు, రామవరం ఎంపీయూపీ స్కూల్ హెచ్ఎం ఎర్ర అగ్నేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



రామవరంలో నవధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

టిప్పర్ లారీల నుంచి పడిన బండ రాళ్లు

ఆందోళన చేసిన రావికంపాడు గ్రామస్తులు

తొండంగి: మండలంలోని కత్తిపూడి నుంచి రావికంపాడు మీదుగా పెరుమాళ్లపురం బీచ్‌రోడ్డుకు వెళ్లే రహదారిలో టిప్పర్ లారీల నుంచి పెద్దపెద్ద బండ రాళ్లు పడుతుండటంతో రావికంపాడు గ్రామస్తులు బుధవారం ఆందోళన చేశారు. కత్తిపూడి నుంచి టిప్పర్ లారీల్లో భారీ బండ రాళ్లను తరలిస్తున్నారు. ఇవి రోడ్డుపై పడుతుండగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ప్రమాదం తప్పింది. తరచూ లారీల నుంచి రాళ్లు పడుతున్నాయని, దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని రావికంపాడు గ్రామస్తులు ఆరోపించారు. ఇటీవల ఈ ప్రాంతంలోనే సీతారాంపురం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు లారీ ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. ఇలాంటి సంఘటనలతో భయాందోళన చెందిన గ్రామస్తులు రావికంపాడులో లారీలను అడ్డుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై రవికుమార్ అక్కడకు చేరుకుని నిర్లక్ష్యంగా రవాణా సాగిస్తున్న లారీ యజమానులపై కేసు నమోదు చేస్తామని చెప్పడంతో గ్రామస్తులు శాంతించారు. ఎటువంటి ప్రమాదాలకు తావు లేకుండా తగిన జాగ్రత్తలు పాటించేలా రవాణా, పోలీసుశాఖ



రావికంపాడులో గ్రామస్తులు నిలిపివేసిన టిప్పర్ లారీలు

ఏలేరు కాలువపై కూలిన కాజ్‌వే

పలు గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు



ఏలేశ్వరంలో ఏలేరు కాలువపై కూలిపోయిన కాజ్‌వే

ఏలేశ్వరం: ఏలేశ్వరం–అప్పన్నపాలెం మధ్య ఏలేరు కాలువపై నిర్మించిన కాజ్‌వే (వంతెన) బుధవారం కూలిపోయింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. 2020 సెప్టెంబర్ 14న ఏలేరు పరివాహక ప్రాంతంలో కురిసిన వర్షాలకు నీటి ఉధృతి ఎక్కువ కావడంతో కాలువలో ఉన్న ఫిల్లర్ ఒరిగిపోయి కాజ్‌వే కుంగిపోయింది. అప్పటి నుంచి కాజ్‌వేపై వాహనాల రాకపోకలు నిలిపివేశారు. ద్విచక్ర వాహనాలు, పాదచారులు మాత్రమే రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల కాజ్‌వే మరింతగా కుంగిపోవడంతో ఉదయం ట్రాక్టర్ సహాయంతో మట్టితో కప్పేందుకు ప్రయత్నించగా ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఏలేరు కాలువపై సుమారు 25 ఏళ్ల క్రితం రూ.99 లక్షలతో కాజ్‌వే నిర్మించారు. ఈ కాజ్ వే మీదుగా ఏలేశ్వరం నుంచి అప్పన్నపాలెం, జగ్గంపేట మండలం ఇర్రిపాక, మామిడాడ, నరేంద్రపట్నం తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. కాగా సంఘటన స్థలాన్ని తహసీల్దార్ సురపరాజు పరిశీలించారు. ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు డేగల వెంకటరమణ, సామంతుల సూర్యకుమార్, కోరాడ ప్రసాద్, పైల విజయ్ తదితరులు ఉన్నారు.

రేపు మండల సమావేశం

రౌతులపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.గోవింద్ బుధవారం తెలిపారు. ఉదయం పది గంటలకు ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశంలో పలు అభివృద్ధి పనులపై చర్చిస్తారన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

వెంకన్న కల్యాణోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు



స్వామివారి ఆలయం వద్ద వేసిన చలువ పందిళ్లు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు వేంకటేశ్వరస్వామి దివ్యకల్యాణ మహోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. శనివారం తెల్లవారుజామున స్వామివారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కాగా స్వామి వారి ఆలయం ఎదురుగా ఉన్న గజేంద్రమోక్ష పుష్కరిణిలో శుక్రవారం వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఈ మేరకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. హైవే మీదుగా స్వామి వారి ఆలయం వరకూ భక్తులు నడుచుకుంటూ రావడంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా ఉత్సవాలకు వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఆలయ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు భక్తుల కు ఇబ్బంది లేకుండా చర్యలు, విద్యుత్ సరఫరా, రక్షిత మంచినీరు, ప్రసాద పంపిణీకి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు ఒబిణ్ని వీరబాబు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

క్లుప్తంగా

ఉచిత రక్తదాన శిబిరం



తుని ఆదిత్య కళాశాలలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

తుని: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అత్యవసర కేసుల కోసం ఆదిత్య కళాశాల విద్యార్థులు రక్తదానం చేసినట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ స్వప్న తెలిపారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు తుని ఆదిత్య కళాశాలలో బుధవారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 25 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ షాహిద్దీన్, ఏవో సుధాకర్ రెడ్డి, తమ్మారావు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



జగపతినగరంలో లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ కనెక్షన్‌లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కిర్లంపూడి: జగపతినగరం పంచాయతీలో సోమవరం గ్రామానికి చెందిన సత్యదేవా భారత్ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత ముఖ్య అతిథిగా పాల్గొని 34 మంది లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు

శంఖవరం: ప్రస్తుత వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీఓ బాలామణి అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో బుధవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. తాగునీరు, పారిశుధ్యం, ఇంటి పన్ను వసూళ్లపై అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ వేసవిలో తాగునీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా పారిశుధ్యం మెరుగు పరచాలన్నారు. ఇంటి పన్నులు సకాలంలో వసూలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జె.రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



తొండంగిలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

తొండంగి: రైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేయించాలని స్థానిక పశువైద్యాధికారి లలిత సూచించారు. తొండంగిలో పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి 23,400 టీకాలు వచ్చాయన్నారు. మార్చి నెలాఖరు వరకూ ఆర్బీకేల్లోని వెటర్నరీ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో పశువులకు టీకాలు వేస్తారన్నారు. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలకు కచ్చితంగా టీకాలు వేయించాలని సూచించారు.

పరిశుభ్రతపై పర్యవేక్షణ

కిర్లంపూడి: జగపతినగరం గ్రామ పంచాయతీ పరిధిలోని 18 వార్డుల్లో పరిశుభ్రతపై పర్యవేక్షణ కార్యక్రమానికి సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డుల్లో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ అడారి శివనారాయణ, స్థానిక నాయకులు యల్లపు చినబాబు, తూము కుమార్, శరకణం సంతోష్, గుడాల రాంబాబు పాల్గొన్నారు.

కోరుకొండ దేవస్థానానికి 800 లీటర్ల పాలు, పెరుగు అందజేత

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం దత్తత తీసుకున్న కోరుకొండ శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు అన్నవరం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు నక్కా అశ్విని, నాగేశ్వరరావు దంపతులు 800 లీటర్ల పాలు, పెరుగు విరాళంగా అందజేశారు. కోరుకొండ దేవస్థానంలో వీటిని వినియోగించాలని దాత కోరినట్లు బుధవారం అధికారులు తెలిపారు. దేవస్థానం అన్నదానం ఏఈఓ భ్రమరాంబ, సూపరింటెండెంట్ కాపారపు శివ, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తలుపులమ్మతల్లిని దర్శించిన దేవదాయశాఖ మంత్రి



హైవే వద్ద ఆలయంలో తలుపులమ్మను దర్శించుకున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

తుని రూరల్: మండలంలోని జగన్నాథగిరి వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఆలయంలో తలుపులమ్మ అమ్మవారిని బుధవారం రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద మంత్రికి ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు, చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, వేదపండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం మంత్రికి వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. లోవ దేవస్థానంలో అమ్మవారిని దర్శించి, ఆలయ పునఃనిర్మాణ పనుల పరిశీలన అనంతరం మంత్రి అధికారుల సమీక్ష సమావేశంలో పాల్గొనాల్సి ఉంది. కాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హాజరవుతున్న నిడదవోలు పర్యటనలో మంత్రి పాల్గొనాల్సి ఉండడంతో హైవే వద్ద ఉన్న నమూనా ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని వెళ్లిపోయారు. దీంతో లోవ కార్యక్రమాలు రద్దయ్యాయి. మంత్రి వస్తున్నారన్న సమాచారంతో కాకినాడ జిల్లాకు చెందిన ఈఓలు, దేవదాయశాఖ ఉద్యోగులు పలువురు లోవ దేవస్థానానికి వచ్చి వెనుతిరిగి వెళ్లిపోయారు.

అమరవీరుల త్యాగాలు మరువలేం



గోకవరంలో మాదిగ అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఎస్‌పీ నాయకులు

గోకవరం: ఎస్సీ వర్గీకరణ సాధనలో ప్రాణత్యాగం చేసిన మాదిగ అమరవీరుల త్యాగాలు మరువలేనివని మహాజన సోషలిస్ట్ పార్టీ మండలాధ్యక్షుడు గరబారపు శ్రీనివాస్ అన్నారు. స్థానిక సంజీవయ్యనగర్‌లోని కమ్యూనిటీ భవనం ఆవరణలో బుధవారం మాదిగ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ సాధనలో అసువులు బాసిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణకు వీరి చేసిన త్యాగాన్ని ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని శ్రీనివాస్ సూచించారు. కార్యక్రమంలో ములపర్తి నాగేశ్వరరావు, పులిగుర్తి రాములు, చాపల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

ప్రత్తిపాడు రూరల్: రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ మాధవి అన్నారు. మండలంలోని పెద్దిపాలెంలో ఏఓ వై.గంగాధర్ ఆధ్వర్యంలో వైఎస్సార్ పొలంబడి నిర్వహించారు. రైతులకు వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మాత్రమే ఎరువులు, పురుగు మందులు వాడాలన్నారు. అన్నదాతలు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో తుని భూసార పరీక్ష వ్యవసాయ అధికారి విజయకుమార్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దిపాలెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు